కుర్మిద్ద గ్రామంలో కలెక్టర్ పర్యటన

యాచారం మండలం కుర్మిద్దలో పర్యటించిన జిల్లా కలెక్టర్ శశాంక

యాచారం, జూలై 27 : మండలంలోని కుర్మిద్ద గ్రామంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంక శనివారం పర్యటించారు. గ్రామంలోని 92 సర్వే నంబర్ స్థలాన్ని రెవెన్యూ అధికారులు, పోలీసులతో కలిసి ఆయన స్వయంగా పరిశీలించారు. 92 సర్వే నంబర్‌లోని భూమి విస్తీర్ణం, రైతుల వివరాలు తహసీల్దార్ అయ్యప్పను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 12 నుంచి 15 వరకు ఇన్నోవా కార్లు వెళ్లడంతో ఫార్మాసిటీ భూములను పరిశీలించడానికి అధికారులు వచ్చారని తెలుసుకున్న రైతులు, గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. అధికారులను ఎందుకు వచ్చారని అడిగినప్పటికీ అధికారులు బదులివ్వలేదని గ్రామస్తులు తెలిపారు. ఫార్మాసిటీ భూములు పరిశీలించడానికి వస్తే మాత్రం మా భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. కలెక్టర్ శశాంక శుక్రవారం సైతం గ్రామంలోని భూములను అధికారులు, పోలీసులతో కలిసి పరిశీలించినట్లు రైతులు పేర్కొన్నారు. అసలు మండలంలో ఫార్మాసిటీ ఉన్నట్టా.. లేనట్టా.. అని ఆందోళన చెందుతున్నారు. కలెక్టర్ శశాంక మాత్రం కేవలం భూములను పరిశీలించి వెళ్లడం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ఒక్క దవాఖానైన నిర్మించారా ?

సర్కారు దవాఖానపై కాంగ్రెస్ నాయకులవి అర్థం లేని ఆరోపణలు

విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

షాద్‌నగర్, జూలై 28 : కాంగ్రెస్ పాలనలో ఒక్క దవాఖానైన నిర్మించారా ?.. అని కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీటీసీల సంఘం మాజీ మండల అధ్యక్షుడు బీష్వ రామకృష్ణ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డితో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ కృషితో షాద్‌నగర్ పట్టణంలో 100 పడకల దవాఖాన నిర్మాణానికి అనుమతులు వచ్చాయని, మాజీ మంత్రి హరీశ్‌రావు పనులను ప్రారంభించగా, నేటికీ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ విషయాన్ని మర్చిపోయిన కాంగ్రెస్ నాయకులు అర్థం లేని ఆరోపణలు చేస్తూ తమ ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ అనుమతులను పొందడంతో ఎన్నో ఇబ్బందులు ఉంటాయని, దశాబ్దాల కాలం పాటు షాద్‌నగర్ వాసులు దవాఖాన నిర్మాణం కోసం ఎదురుచూశారని, ఎంతో మంది ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పాలించినా 100 పడకల దవాఖాన కలను మాత్రం మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ నెరవేర్చారనే విషయాన్ని అధికార పార్టీ నాయకులు గ్రహించాలని కోరారు. 2021 డిసెంబర్‌లో దవాఖాన నిర్మాణానికి రూ.20.83 కోట్ల నిధులను మంజూరు చేస్తూ అప్పటి ప్రభుత్వం ప్రొసీడింగ్ ఇచ్చిందనే వాస్తవాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్తించాలన్నారు. గుత్తేదారులకు బిల్లుల చెల్లింపు అనే పక్రియ ప్రభుత్వ నిధుల విడుదలపై ఆధారపడి ఉంటుందని, అభివృద్ధి పనులు కొనసాగుతున్న సమయంలో విడుతల వారీగా బిల్లుల చెల్లింపు ఉంటుందని, ఇది కూడా మా గొప్పతనమే అనే రితీలో వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. రాష్ట్రంలో రూ. 50 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని స్థాయికి మించిన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. షాద్‌నగర్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ దవాఖాన టీడీపీ హయాంలో నిర్మిస్తే , నేడు నిర్మాణంలో ఉన్న 100 పడకల దవాఖాన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిందనే విషయం తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. అర్థం లేని వ్యాఖ్యలు చేస్తూ కాలయాపన చేయడం తప్పా ఎలాంటి ప్రయోజనం లేదని, అభివృద్ధికి అన్ని పార్టీల నాయకులు సహకరిస్తారనే విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్యయాదవ్ నాయకత్వంలో సుమారు రూ. 4 వేల కోట్లకుపైగా నిధులు అభివృద్ధి పనులకు, సంక్షేమానికి వచ్చాయని స్పష్టం చేశారు. నేడు షాద్‌నగర్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రతి అభివృద్ధి పని బీఆర్ఎస్ పాలనలోనే ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చెట్ల నర్సింహ, పిల్లి శేఖర్, జూపల్లి శంకర్, పులిజాల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

షాద్‌నగర్ పట్టణంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం

మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

- **సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాన్‌వెస్లీ**
- **సీపీఎం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ వర్ధంతి సభ**

బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నది : తమ్మినేని

ఇబ్రహీంపట్నం, జూలై 27 : ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం లో జరిగిన మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ వర్ధంతి సభకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకులు చేసిన తప్పులనే చేస్తున్నదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో విఫలమైందని ఆరోపించారు. పాలకులు హామీల అమల్లో తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నదని తమ్మినేని వీరభద్రం అన్నారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసి పేదలను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నదన్నారు. స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ ఈ ప్రాంతంలో అనేక పోరాటాలు నిర్వహించి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగారని కొనియాడా రు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పగడాల యాదయ్య, నాయకులు మదుసూదన్‌రెడ్డి, సామేల్, జంగయ్య, జగన్, నర్సింహ, వెంకటేశ్, కవిత, అంజయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం నుంచి వాహనాలు రాకుండా జేసీబీ సాయంతో కందకం తవ్విస్తున్న ఆర్డీవో అనంతరెడ్డి

హైకోర్టు నోటీసులతో పాఠశాలకు హద్దుల ఏర్పాటు..

తుర్కయాంజాల్, జూలై 27 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ మండల ప్రజాపరిషత్తు పాఠశాల ఆవరణ మధ్యలో రోడ్డు వివాదంపై ఇటీవల ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేయడంతో అధికారులు స్పందించి శనివారం పాఠశాల సరిహద్దులను గుర్తించి జేసీబీ సాయంతో కందకం తవ్వించారు. వివరాల్లోకి వెళితే.. మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ మండల ప్రజాపరిషత్తుకు చెందిన 1725 చ.గజాల స్థలం నుంచి న్యూ సుభాష్‌నగర్ సంక్షేమ సంఘం వారు రోడ్డు వేయడానికి ప్రయత్నిస్తున్నారని గత సంవత్సరం పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉన్న బి.దాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. దీనిపై స్పందించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.అనిల్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి రెవెన్యూశాఖ, పాఠశాల విద్యాశాఖ, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శులు, విద్యాశాఖ కమిషనర్, రంగారెడ్డి కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, విద్యాశాఖాధికారులు, ఎంపీడీవో, మున్సిపాలిటీకి నోటీసులు జారీ చేస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

దీంతో శనివారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావులు కమ్మగూడ పాఠశాలకు చేరుకుని హద్దులను గుర్తించి కాలనీ వాసులు పాఠశాల మధ్య నుంచి ఉపయోగిస్తున్న రోడ్డు వైపు కందకం తవ్వారు.త్వరలోనే పాఠశాలకు పూర్తి స్థాయిలో ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

రుణమాఫీపై ఆరా..

రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

పరిగి, జూలై 27 : రూ.లక్షలోపు రుణమాఫీకి సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తెలియజేయాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ రైతులను కోరారు. శనివారం మండలంలోని నస్కల్ గ్రామంలో బసమ్మ, యాదయ్య, రాజేందర్, రాజన్న, బక్కన్న, శేఖర్, దస్తయ్య, గోపాల్ తదితర రైతులతో ఆయన మాట్లాడారు. కొందరు రైతులు రుణమాఫీ డబ్బులు తమ బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయని తెలుపగా, కొందరు కొన్ని సమస్యలను తెలిపారు. కొత్త పాసు పుస్తకాలు వచ్చిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు మేడిద రాజేందర్, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, జూలై 27 : ప్రభుత్వ వైద్య కళాశాల మహేశ్వరంలో నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల మహేశ్వరంలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన డీఈవోలు(11), ల్యాబ్-అటెండెర్(08), ఆఫీస్ సబార్డినేట్(09), థియేటర్ అసిస్టెంట్(04) పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. 31-07-2024న ఉదయం 10గంటలకు వాక్ ఇన్-ఇన్-ఇంటర్ ఇంటర్వ్యూ ద్వారా డీఎంహెచ్‌వో, శివరాంపల్లి, హైదరాబాద్, రంగారెడ్డిజిల్లా, DME TS, వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు.

ఈ నెల 29న జిల్లా అథ్లెటిక్స్ పోటీలు

షాబాద్, జూలై 27 : ఈ నెల 29వ తేదీన రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం ఉదయం 8 గంటలకు 12 సంవత్సరాలు పైబడిన వారికి అండర్ 12, 14, 16, 18, 20 ఇయర్స్ మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో 3వ ఏఎఫ్ఐ జావెలిన్ డే అథ్లెటిక్స్‌లో భాగంగా జావెలిన్ త్రో 100, 400 మీ. పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కోచ్ తిప్పాన సాయిరెడ్డిని 9703838987 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రతి ఉద్యోగి అంతకి భావంతో పని చేసి గొప్ప పేరు తెచ్చుకోవాలి

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్

బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానించిన ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, జూలై 27 : ప్రతి ఒక్క ఉద్యోగి అంతకి భావంతో పని చేసి గొప్ప పేరు తెచ్చుకోవాలని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ తెలిపారు. శనివారం వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శుల బదిలీల సందర్భంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చాలా బాగున్నాయన్నారు. ఇదే మాదిరిగా ప్రభుత్వం ఇచ్చే పనులను క్రమ శిక్షణతో చేసి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించి ఆదర్శంగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వినయ్‌కుమార్, సూపరింటెండెంట్ చెన్నారెడ్డి, కార్యదర్శులు కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, పాల్గొన్న నాయకులు

కడ్తాల్, జూలై 27 : ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి కల్వకుర్తి నియోజకవర్గానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. శనివారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగు సార్లు కల్వకుర్తి ఎమ్మెల్యేగా, కేంద్ర మంత్రిగా సేవలనందించిన దివంగత సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహాన్ని, కల్వకుర్తిలోని కొత్ర గేట్ వద్ద ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించడానికి ఆదివారం కల్వకుర్తికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్‌కి చేరువలో ఉన్న కల్వకుర్తి ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. ఇక్కడి యువత ఉన్నత చదువులు చదివి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనోపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడంతో ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కల్వకుర్తిపై ప్రత్యేక దృష్టి సారించి ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలో ఐటీ కారిడార్‌తో పాటు పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలతో ప్రతి ఎకరాకి సాగునీరందించి రైతుల కష్టాలను తీర్చాలన్నారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న కల్వకుర్తి ప్రాంతం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో నియోజకవర్గ రూపురేఖలు మారిపోతాయనే ఆశాభావంతో ప్రజలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, నర్సింహ, రామచంద్రయ్య, పాండునాయక్, శ్రీకాంత్, రాజు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

దామగుండం ఫారెస్ట్‌ను సందర్శించిన అధికారులు

పూడూరు, జూలై 27 : నేవి సిగ్నల్ రాడర్ ఏర్పాటు స్థలాన్ని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ లింగనాయక్, నేవి అధికారులు సందర్శించి పరిశీలించారు. పూడూరు మండల కేంద్రం సమీపంలో దామగుండం అటవీలో నేవి రాడర్ సిగ్నల్ ఏర్పాటుకై స్థలన్ని సేకరించిన విషయం తెలిసిందే. నేడు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రితో కలిసి శంకుస్థాపన చేయాల్సి ఉన్నది. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల శంకుస్థాపన రద్దైనట్లు విశ్వసనీయ సమాచారం. దామగుండం ఫారెస్ట్‌లోని 2900 ఎకరాల భూమిలో నేవి సిగ్నల్ రాడర్, కార్యాలయాలు, గృహ నిర్మాణాల కోసం పలు ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిసింది. వీరితో పాటు ఫారెస్ట్ అధికారులు ఉన్నారు.

ఆటపాటలతో చక్కగా పాఠ్యాంశాలు బోధించాలి

ఎఫ్ఎల్ఎన్‌తో అభ్యసనా సామర్థ్యాల మెరుగు

జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి

విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ఉమాహారతి

తాండూరు, జూలై 27 : జాతీయ విద్యావిధానంలో అమలు చేస్తున్న అంశాలను విద్యార్థులు అందుకునేందుకు ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. శనివారం తాండూరు పట్టణంలోని నంబర్-2 ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలతో పాటు బ్లాక్ బోర్డుపై అక్షరాలను రాయించారు. పుస్తకంలో పదాలను చదివించారు. విద్యార్థులు ఏ విధంగా చదవాలి,. ఉపాధ్యాయులు ఎలా బోధించాలని అన్నదానిపై సూచనలు చేశారు. ఆంగ్లం, గణితం విషయంలో ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలలో ప్రవేశ పెట్టిన ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చేలా ఉంటుందన్నారు. ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ విధానంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కగా ఆటపాటలతో పాఠ్యంశాలను బోధించాలన్నారు. విధుల్లో ఎవరైనా సరే నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటయ్యగౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల విద్యార్థి

జపాన్‌లో నిర్వహించే సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థి సర్బజిత్

చేవెళ్లటౌన్, జూలై 27 : జపాన్‌లో జరగబోయే సైన్స్ ఫెస్టివల్‌కు చేవెళ్ల మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి సర్బజిత్ జిల్లా మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ టేనావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి సర్బజిత్ జపాన్‌లో జరుగబోయే సైన్స్ ఫెస్టివల్‌కు వెళ్లేందుకు శనివారం హైదరాబాద్‌లో సైన్స్ ఇన్‌స్పైర్ పరీక్ష రాయగా జిల్లా మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఇన్‌స్పైర్ స్కీమ్ నుంచి ఇది ఒక అద్భుత అవకాశమన్నారు. ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ NIF న్యూ ఢిల్లీ వారి ఆదేశాల మేరకు ప్రతి రాష్ట్రం నుంచి నలుగురు విద్యార్థుల చొప్పున జపాన్‌కు వెళ్లేందుకు అవకాశం లభించిందని, మా కళాశాల నుంచి విద్యార్థి రాష్ట్రస్థా యికి ఎంపిక కావడం సంతోషంగా ఉన్నదని తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంతగోని శివకృష్ణ

మాడ్గుల, జూలై 27 : విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంతగోని శివకృష్ణ విమర్శించారు. విద్యారంగ సమస్యలకు నిరసనగా ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండల కేంద్రంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొంతగోని శివకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 8వేల కోట్ల స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 15 శాతం నిధులు కూడా కేటాయించకపోవడం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయడమేనని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, గ్రూప్స్ పోస్టులు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకుండా ముఖ్యమంత్రి దగ్గరే విద్యాశాఖ పెట్టుకోవడం సబబు కాదన్నారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి సమస్యలను పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దండు కార్తీక్, విద్యార్థి సంఘం నాయకులు మహేశ్, గణేశ్, పవన్, శివ, మణికంఠ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

స్మిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

లేని పక్షంలో ఉద్యమిస్తాం: ఆర్.కృష్ణయ్య

చిక్కడపల్లి, జూలై 27: ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ గర్వంతో చేసిన వ్యాఖ్యలు సర్వీస్ రూల్స్ వ్యతిరేకంగా ఉన్నాయని బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మితాసబర్వాల్ దివ్యాంగుల రిజర్వేషన్ వ్యతిరేకిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను వ్యతిరేకించడం అవుతుందన్నారు. వెంటనే స్మితాసబర్వాల్ చేసిన వ్యాఖ్యలను విరమించుకోవాలని లేనిచో 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి: వెన్నెల గద్దర్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవ్సాలిన అసవరం అందరిపై ఉందని ప్రజా యుద్ధ నౌక గద్దర్ కుమార్తె, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వెన్నెల గద్దర్ అన్నారు. అశోక్‌నగర్‌లో బాలలతకు మద్దతుగా ఆమె మాట్లాడారు. దివ్యాంగులపై చేసిన వాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. జన చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు నగేశ్, మమతారెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.